దళిత ముస్లిం, క్రైస్తవులకు ఎస్సీ హోదా ఇచ్చి.. కులగణన చేయాలి

ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్

సీఎం, బీసీ కమిషన్‌కు రాసిన లేఖలను చూపుతున్న గాలి వినోద్‌కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 8: రాష్ట్రంలో దళిత ముస్లిం, క్రైస్తవులకు ఎస్సీ హోదా ఇచ్చి తక్షణమే కులగణన చేయాలని దళిత క్రైస్తవ దండోరా జాతీయ కన్వీనర్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. దళిత బుద్ధిస్టులు, సిక్కులకు ఎస్సీ హోదా ఇచ్చి, వారి మత హక్కు, కుల రిజర్వేషన్లను పరిరక్షించినట్లే, దళిత ముస్లిం, క్రైస్తవులకు సైతం పరిరక్షించాలని కోరారు. తార్నాకలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర బీసీ కమిషన్లకు లేఖలు పంపినట్లు తెలిపారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన దళిత క్రైస్తవ, ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించాలని మండల్ కమిషన్ నుంచి మొదలుకుని జస్టిస్ రంగనాథ్ కమిషన్, జాతీయ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కమిషన్లన్నీ సిఫార్సు చేశాయని గుర్తు చేశారు. కానీ 75 ఏండ్లుగా సమస్యకు పరిష్కారం లభించలేదన్నారు. వారికి న్యాయం చేసేలా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు.

'వీసీల నియామకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలి'

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 8: రాష్ట్రంలో త్వరలో వర్సిటీలకు నియమించే వైస్ చాన్స్‌లర్ నియామకాల్లో క్రిస్టియన్ మైనారిటీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్, చర్చి ఆఫ్ సౌత్ ఇండియా ట్రస్ట్ అసోసియేషన్, క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. ఆయా సంస్థల ప్రతినిధులు రెవరెండ్ డాక్టర్ టి.భాస్కర్, ఎం.సాలొమన్ రాజ్ ఒక ప్రకటన విడుదల చేశారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి క్రైస్తవులు మన రాష్ట్రంలోని విద్యావిధానానికి, సామాజిక అభివృద్ధికి చేస్తున్న సేవలు ఎనలేనివని గుర్తుచేశారు. అయినప్పటికీ గతంలో ప్రభుత్వాలు ఉన్నత విద్యావిధానంలో క్రైస్తవులను విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రిస్టియన్ మైనారిటీలకు ఒక్కసారి కూడా వీసీ పోస్టు ఇవ్వలేదని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలకు ఏకకాలంలో వీసీలను నియమించనున్నందున తప్పనిసరిగా అవకాశం కల్పించాలని కోరారు. అన్ని వర్గాలకు న్యాయం చేస్తానంటున్న సీఎం రేవంత్‌రెడ్డి వీసీల నియామకాల్లో న్యాయం చేయాలన్నారు. క్రిస్టియన్ మైనారిటీల్లోనూ వర్సిటీల అభ్యున్నతి కోసం పనిచేసిన అనుభవజ్ఞులైన సీనియర్ ప్రొఫెసర్లు ఉన్నారని చెప్పారు. వారికి ఉన్నత పోస్టుల్లో ప్రాధాన్యతను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

హైదరాబాద్ ఎంపీగా, ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ గెలుపొందడంతో రాంగోపాల్‌పేట్ డివిజన్ రాణిగంజ్‌కు చెందిన ఎంఐఎం నాయకుడు అశోక్ శనివారం ఆ పార్టీ కార్యాలయంలో ఎంపీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

- బేగంపేట్

మల్కాజిగిరి ఎంపీగా గెలిచిన ఈటల రాజేందర్‌ను పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించారు. సికింద్రాబాద్ నుంచి గంగపుత్ర సంఘం నాయకులు మద్దెర్ల శ్యాంసుందర్, పూస రాజ్‌కుమార్ శనివారం మేడ్చల్‌లోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

- సికింద్రాబాద్

బేగంపేటలోని షాపర్స్ స్టాప్-ఓల్డ్ విమానాశ్రయ ఫ్లైఓవర్ ప్రాంతంలో శనివారం కురిసిన వర్షానికి భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ జాం కావడంతో ఇటు ప్రయాణికులు అటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ముందుకు సాగేదెలా..

పోలీస్ స్టేషన్ ఆవరణలో బబ్బుగూడ మార్కెట్ ప్రతినిధులతో సమావేశమై సూచనలు చేస్తున్న ఏసీపీ హనుమంతరావు

బబ్బుగూడ మార్కెట్‌లో నిబంధనలు పాటించాలి

- బాలానగర్ ఏసీపీ హనుమంతరావు

అమీర్‌పేట్, జూన్ 8: బక్రీద్ పండుగ పురస్కరించుకుని సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధి బబ్బుగూడ మార్కెట్‌లో జరిగే పశువుల క్రయవిక్రయాలు పూర్తిగా ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు లోబడి జరపాలని బాలానగర్ ఏసీపీ హనుమంతరావు స్పష్టం చేశారు. శనివారం సనత్‌నగర్ పీఎస్‌లో పశువుల విక్రయదారులు, వెటర్నరీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఏసీపీ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పశువుల రవాణా సమయంలో నిబంధనల మేరకు పూర్తి రశీదులు కలిగి ఉండాలని, వెటర్నరీ సిబ్బంది ద్వారా అనుమతి పొందని పశువులను ఎట్టి పరిస్థితుల్లో స్లాటర్ హౌస్‌లకు తరలించవద్దని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎటువంటి వివాదాలకు తావులేకుండా వెటర్నరీ సిబ్బంది విధులకు మార్కెట్ ప్రతినిధులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ పురేందర్‌రెడ్డితో పాటు ఎస్ఐలు పాల్గొన్నారు.

కంటోన్మెంట్ ఏడో వార్డు పరిధిలోని లాల్‌బజార్ శాస్త్రినగర్ హోలీ ఫ్యామిలీ చర్చిలో ఫీస్ట్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే శ్రీగణేశ్ హాజరై ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్ మారెడ్డి, సీనియర్ నాయకులు మైఖేల్, జీవకన్, సరిత, రవీందర్‌గుప్తా, శ్యామ్‌సన్ తదితరులు పాల్గొన్నారు. - బొల్లారం

మహోన్నత వ్యక్తిత్వం.. రామోజీరావు సొంతం

ఈనాడు గ్రూపు సంస్థల వ్యవస్థాపకుడు రామోజీరావు మృతిపై పలువురి సంతాపం

అమీర్‌పేట్, జూన్ 8: మహోన్నతమైన వ్యక్తిత్వ విలువలకు రామోజీరావు నిలువెత్తు నిదర్శనమని జెక్‌కాలనీలో ఏర్పాటు చేసిన సంతాప సభలో వక్తలు పేర్కొన్నారు. అట్టడుగుస్థాయి నుంచి జీవితాన్ని ప్రారంభించి ఆయన, తాను అడుగిడిన ప్రతి రంగంలో అత్యున్నత శిఖరాలు చవిచూశారన్నారు. సుదీర్ఘమైన తన జీవన ప్రయాణంలో నిబద్ధత, జవాబుదారీతనానికి ఆయన పెద్దపీట వేసుకొని, చివరి శ్వాస వరకు వాటికి కట్టుబడి ఉన్నారన్నారు. సనత్‌నగర్ జెక్‌కాలనీ గాంధీ విగ్రహం వద్ద రామోజీరావు చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పుష్పాంజలి ఘటించారు. కాలనీ ప్రతినిధులు ఎం.లక్ష్మణ్‌రావు, డాక్టర్ వైవీ రాఘవయ్య, శ్రీహరి, పట్టాభి, జీపీ రావు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో కాలనీవాసులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆయన లేని లోటు తీరనిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెక్‌కాలనీ రెసిడెంట్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు డాక్టర్ మల్లు ప్రసాద్, శివారెడ్డి, హరిప్రసాద్, విస్‌డమ్ చౌదరి, మోడల్ కాలనీ ప్రతినిధులు దండా బుచ్చిబాబు, జేఎస్టీ శాయి, సీనియర్ పాత్రికేయులు రమేశ్, ఎఫ్‌సీఐ విశ్రాంత ఉద్యోగి రేణుమాను భాష తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషకు పట్టం కట్టి..

సికింద్రాబాద్: తెలుగు భాష కలుషిత మవుతున్న పరిస్థితుల్లో మాతృభాషకు పట్టం కట్టిన మహోన్నతమైన వ్యక్తి రామోజీరావు అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిప్రసాద్‌గౌడ్ అన్నారు. రామోజీరావు మృతి తీరని లోటని బీజేపీ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి అన్నారు. వారు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. రామోజీ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలిపారు. జర్నలిజంలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. రామోజీరావు మృతి తెలుగు ప్రజలకు తీరని లోటని టీడీపీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వల్లా రపు శ్రీనివాస్‌కుమార్ అన్నారు. పత్రికా రంగం కురువృద్ధుడిని కోల్పోయిందని ఆయన పేర్కొన్నారు.

రామోజీరావు చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న జెక్‌కాలనీ నివాసితులు

గ్రీన్ ల్యాండ్స్-ప్రజా భవన్ ఎదురుగా శనివారం కురిసిన వర్షానికి నీరు నిలిచిపోయింది. దీంతో వాహనదారులు, పాదచారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి

క్రీడల్లో సర్కారు బడి విద్యార్థుల ప్రతిభ

విజేత మనుదీప్ ఆదిత్యకు సన్మానం చేసిన పాఠశాల హెచ్ఎం మల్లికార్జున్‌రెడ్డి

బన్సీలాల్‌పేట్, జూన్ 8: భోలక్‌పూర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న మారపాక మనుదీప్ ఆదిత్య, హనుమకొండలో తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ నిర్వహించిన జావెలిన్‌త్రోలో మూడో స్థానంలో నిలిచాడు. పాఠశాల హెచ్ఎం కె.మల్లికార్జున్‌రెడ్డి శనివారం మనుదీప్‌ను శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ మైదానంలో జూన్ 6, 7తేదీల్లో రాష్ట్ర స్థాయి కిడ్స్, యూత్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో మూడో స్థానం సాధించాడన్నారు. సికింద్రాబాద్ జింఖాన మైదానంలో కోచ్ రాజేశ్ ప్రోత్సాహంతో పాల్గొన్న ప్రతిపోటీలో అతడు తన ప్రతిభతో విజయం సాధించడం హర్షణీయమని తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులైన అన్నదమ్ములు మారపాక భాస్కర్ ఆదిత్య, మనుదీప్ ఆదిత్య చిన్నవయస్సులోనే క్రీడా రంగంలో మెడల్స్ సాధించడం తమకు ఎంతో గర్వకారణమని ఆయన అన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు లూర్దు మేరి, లక్ష్మీదేవి, పరశురాం, మనుదీప్ తండ్రి మారపాక భాస్కర్ పాల్గొన్నారు.

గెలుపులో భాగమైన వారికి రుణపడి ఉంటా

కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్

మారేడ్‌పల్లి, జూన్ 8: తన గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఎల్లప్పుడు రుణపడి ఉంటానని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. శనివారం మోండా డివిజన్‌లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు బాబురావు, అల్లాడి గౌరీశంకర్, నందికంటి రవి, సి.సంతోష్‌యాదవ్ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ జరిగింది. సెకండ్‌బజార్‌లోని డొక్కాలమ్మ ఆలయం నుంచి రెజిమెంటల్‌బజార్, అంబేద్కర్‌నగర్, జేపీనగర్, టీచర్స్‌కాలనీ, మారేడ్‌పల్లి వరకు కొనసాగింది. వివిధ జిల్లాలకు చెందిన కళాకారుల ఆట, పాటలు, పోతురాజుల నృత్యాలు, డప్పు చప్పుళ్లతో సాగింది. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తన గెలుపు కోసం కృషి చేసిన ప్రతిఒక్క నాయకుడు, కార్యకర్తలందరికి కృతజ్ఞతలు తెలిపారు. కంటోన్మెంట్‌లో నెలకొన్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక నిధులను తీసుకొచ్చి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బద్రినాథ్‌యాదవ్, సి.కృష్ణయాదవ్, సురవి శ్యాంసుందర్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

రెజిమెంటల్‌బజార్‌లో విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేశ్, మైనంపల్లి హన్మంతరావు

ట్రంపెట్ ఫెస్టివల్ ఫెలోషిప్ ర్యాలీ

ఫెస్టివల్ ర్యాలీ ప్రారంభిస్తున్న మాజీ డీజీపీ స్వరణ్‌జిత్ సేన్, తదితరులు

మారేడ్‌పల్లి, జూన్ 8: సికింద్రాబాద్ వెస్లీ చర్చిలో ట్రంపెట్ ఫెస్టివల్ ర్యాలీని మాజీ డీజీపీ స్వరణ్‌జిత్ సేన్ జెండా ఊపి ప్రారంభించారు. శనివారం ర్యాలీ.. క్లాక్‌టవర్ నుంచి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వరకు వెళ్లి తిరిగి చర్చికి చేరుకుంది. వందలాది మంది క్రైస్తవులు ప్లకార్డులు పట్టుకుని ఏసుక్రీస్తు పాటలు పాడుతూ క్రీస్తు రెండో రాకడపై అవగాహన కల్పించారు. అంతకుముందు చర్చి ఆవరణలో జరిగిన కార్యక్రమంలో స్వరణ్‌జిత్ సేన్, మెథడిస్ట్ చర్చ్ ఆఫ్ ఇండియా బిషప్ జాన్ గొల్లపల్లి క్రీస్తు రెండో రాకడను వివరించారు. లోకంలో పాపులను రక్షించేందుకు ఏసుక్రీస్తు మరోమారు ఈ లోకానికి రాబోతున్నాడని బైబిల్‌లో స్పష్టంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఫెలోషిప్ ప్రతినిధి సెల్విన్‌రాజ్, ప్రధాన కార్యదర్శి సంపత్ కుమార్, చార్లెస్ సంపత్ పాల్గొన్నారు.

వారాసిగూడలో అన్నదానం..

సికింద్రాబాద్, జూన్ 8: వారాసిగూడ సాయిఅమ్ములు ఆసుపత్రి ఎదుట శనివారం పేదలకు అన్నదానం చేశారు. దవాఖాన నిర్వాహకురాలు డాక్టర్ మృణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారు. బీఆర్ఎస్ నాయకుడు మహదేవన్ రవి సమాజ సేవకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నాడు. వారంలో రెండు రోజులు (శుక్ర, శని) పేదలకు, అనాథలకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నారు.

గిరిజనులకు 10శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న గిరిజన శక్తి ప్రతినిధులు, చిత్రంలో ఎమ్మెల్యేలు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 8: రాష్ట్రంలో గిరిజనులకు 10శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు శరత్‌నాయక్ డిమాండ్ చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని రాష్ట్ర కమిటీ నాయకులు శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్‌రావు సమక్షంలో మంత్రిని కలిశారు. అనంతరం శరత్‌నాయక్ మాట్లాడుతూ.. రిజర్వేషన్ల జీవో నంబర్ 33కు వ్యతిరేకంగా కొంత మంది హైకోర్టులో వేసిన పిటిషన్‌ను కొట్టివేసేలా రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన బిడ్డలకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో 10 శాతం రిజర్వేషన్లు అమలయ్యేలా కృషి చేయాలన్నారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని, సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో గిరిజన శక్తి నాయకులు డాక్టర్ వెంకటేశ్ చౌహాన్, డాక్టర్ రాజేశ్‌నాయక్, రమేశ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహించిన ప్రదర్శనల్లో పలువురు నృత్యకారులు సంప్రదాయ నృత్యరీతులతో అలరించారు. ప్రదర్శనల్లో మయూరి నృత్యాలయాల గురువులు శ్రీదేవి రాజనాల శిష్య బృందం నర్తించిన కూచిపూడి నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. - కొండాపూర్